

# సెన్సారింగు సర్కస్

కిట్ కట్ కట్ రట్.... ఠ్రట్ ఠ్ర. ఠ్రఠ్రరట్! నోనో సార్ ఇజ్జాస్తే--ఐ మీన్ . సెన్సారు వాళ్ళుజ్జాస్తే ఇంకేమన్నా ఉందా సార్! కొంపలు మునిగిపోవూ? మళ్ళీ ఇంకో టేక్ తీద్దాం. ఆ కాఫీ కప్పు అందించి నపుడలా వేళ్ళు తగల్నీకండి. జాగర్త. మీదెంత మేనరికమైనా ఇంకో

రెండురీళ్ళతో మీరెంత దీనిగా ఎంత ఫెళ్ళుమనేలా పెళ్ళాడబోతున్నా ఈ రీల్లో అలా ఒకళ్ళనొకళ్ళు తాక్కోకూడదు. కాఫీ ఇస్తున్నపుడేనాసరే. వళ్ళు తగిలితే వెంటనే ఛీ ధూర్తుడా! అవివాహిత భారతబాలికను తాకుతావా అని మేనకోడలు అనాల్సి వస్తుంది. లేకపోతే ఇద్దరూ అగ్నిప్రవేశం చేసి ప్రాయశ్చిత్తం చేసుకోవాలి. లేకపోతే సెన్సారువారు ఒప్పుకోరు. రీలు తగలేయించేస్తారు దగ్గిరుండి.

నో సార్ నో.... యస్సర్ యస్ మీరు చూళ్ళేదా? కొత్త సెన్సారింగు సర్కసూ? కొత్త రూళ్ళుకర్ర లొచ్చాయి. పెళ్ళి కాని వారిద్దరు ఒకళ్ళనొకళ్ళు ముట్టేసుకో కూడదు. యస్.... నో డూయట్ డాన్సెస్ నో లవ్ సీన్స్. ప్రేమపాటలు తీసినా మన సినిమాలను పురాతన పద్ధతుల్లోనే తీయాలన్నమాట. అనగా ఆవిడ సాంగు మొదలెట్టి పరుగెడుతుంది పొదలచుట్టూ, దుబ్బులచుట్టూ, కుర్చీలచుట్టూ, స్తంభాలచుట్టూ--హీరోగారు కూతవేటు దూరంలోనే ఉంటూ పాడుతూ అభినయం పట్టాలి. అంతే, అర్జూ గీర్జూ అని కొత్తపద్ధతులు తెచ్చిందికి వీల్లేదు. యస్సార్. యస్.పెళ్ళిచేసుకునేవరకూ, అంతే. అంతెందుకు, పెళ్ళి జరుగుతున్నప్పుడు కూడా పుస్తెల తాడుకి మూడోముడి పడేవరకు పెళ్ళికొడుకు వేళ్ళు పిల్లకూ పిల్లదాని జడగ్గాని తగల్రాదని సెన్సార్ శాసనం. తగిలిందే, సెన్సార్రూళ్ళుకర్ర ప్రొడ్యూసరు నెత్తిన ఠంగున పడిందే. అది రేప్ అనగా బలాత్కారం క్రిందకు వస్తుంది. అంతేమరి, మూడో ముడి పడేదాక టెక్నికల్‌గా పెళ్ళయినట్టు కాదు కదా? వ్వాట్?

హార్గ్యూ చేస్తారా? మైగాడ్. అర్గ్యుమెంట్లూ, లాజిక్కులూ పనికిరావు సార్. రూలంటే రూలే. సెన్సార్రూలంటే మరీను....అంతెందుకూ, ఎక్స్ ప్రొడక్షన్స్ వాళ్ళ పిక్చరులో మొన్ననేం చేశాం? హీరోయిన్లు నూతిలో పడింది. హీరో ఆవిడను సేవ్ చెయ్యాలి. పెళ్ళికాలేదు. హా! దట్ వాజ్ ది ప్రాబ్లెం. వెంటనే పురోహితుణ్ణీ, హీరోయిను ఫాదర్ని కేకేయించుకొచ్చి నూతిలోదించి "ఇయంసీతా మమసుతా...." ముక్కలు మూడూ అనిపించి, అప్పుడు హీరోచేత మూడు ముళ్ళూ వేయించాం--ఆవిడ మూడో గుటక వేసేలోగా. మళ్ళీ టైముండదని పుస్తెలతాడు బదులు పెద్ద వలుపుతాడుతోనే ముళ్ళువేయించి ఆ తాడుతో హీరోగారిచేత ఆవిడని పైకి లాగించాం.

అఫ్‌కోర్సు మనకి నావెల్టీ కూడా కలిసొచ్చింది నూతిలో పెళ్ళి.... కొత్తగా లేదూ, అయిడియా మరి? సెక్సు. రెలిజను, ఎడ్వెంచరు, సస్పెన్సు రొమాన్సు ఇన్ని కలిసొచ్చాయి. సెన్సారు రూళ్ళు కూడా కొరమాలిన వనిందికి వీల్లేదు.....మళ్ళీ ఎక్కడా అనకండి మన్లో మనమాట.బుచ్చమ్మ అని ఒక బ్యూటిఫుల్ యంగ్ విడో ఉండేది. ఆవిడ నన్ను ద్వాహమాడటానికీ నాతో లేచి వెళ్ళిపోయి రావడానికీ ఆరంభంలో ఒప్పుకుంది గాదు. చివరి కామెను దాదాపు ఒప్పించడానికి నేను వేసిన తస్సా ఎలాంటిదనుకున్నారు? అక్షరాలా ఇలాంటిదే.

"వదినా! మొన్న మీ అమ్మగారు నూతిలో దూకారు. ఆవిడకీ మారేజయింది. నాకూ నేడుగాకపోతే పూర్వం ఒకప్పుడైనా మారేజయింది. గాబట్టి నేన్నూతిలో దూకి ఆవిణ్ణి పైకిలాగి సేవ్ చేసినా సరిపోయింది. ఢిల్లీలోని 13వేల తల్లులుగాని, సర్వోదయ వాళ్ళుగాని, మున్షీ, మొరార్జీ, రాజాజీ గాని, ఆఖరికి సెన్సారువాళ్లు గాని తప్పట్ట లేకపోయారు....మరదే రేప్రొద్దున్న మీరు కాల్జారి ఆ నూతిలోనే పడతారనుకోండి. పడ్డాక, అన్నా ఎంత పనయిపోయింది, హాయిగా ఆ గిరీశంగార్ని చేసుకొని మహారాణిలా ఉండాల్సిందని నాలిక్కరుచుకొంటారు. నేను మిమ్మల్ని చూసినా దూకి రక్షించడానికి వీల్లేదు గదా? మనకి పెళ్ళికాలేదు మరి? ఒకవేళ ప్రాణరక్షణ అని వంకపెట్టినా--వెధవది మానవదేహంలో ఉండి--లో లోపల నేనుగాని, మీరుగాని ఆ యొక్క మధుర స్పర్శవల్ల ఆ అవాంతర స్థితిలోనే ఏ కాస్తయినా ఆనందం పొందినట్టాయెనా--కొంప మునిగి పోతుంది. సెన్సారడకత్తెర మన పీకెలు కత్తిరిస్తుంది. గాన ముందే మారేజి చేసుకుని రడీగా వుండడం మంచిది" అవటాని ఒక గంభీరమైన లెక్చరిచ్చేశాను. "అంతేనంటారా? గిరీశంగారూ!" అవటాని ఆ యంగ్‌విడో ముక్కున వేలేసుకుని సాలోచనగా చూస్తూ నిలబడిపోయింది.

యావంటారు--ఈ రూళ్ళను వంచలేమా అంటారా? చిత్తం. డొంకతిరు గుళ్ళుంటూనే ఉంటాయి. పెళ్ళిజరగడానికి ముందు రొమాన్సు ఉండరాదని ప్రేమికులు ఒకళ్ళ నొకళ్ళు తాకరాదని రూలు కదా. మొన్న అల్లా పిక్చరదేవిటి.... అందులో

పెళ్ళిసీనులు ముందర షూట్ చేశారు. ప్రేమ సీనులు తగవాత తీశారు. కథలో ప్రేమ ముందు, పెళ్ళి వెనకా వస్తాయనుకోండి. అయినా రూలు ప్రకారం పెళ్ళే ముందుగా తీశామని సెన్సారు వాళ్ళకి చెప్పుబోతున్నారు. ఒప్పుకుంటార్లెండి.

అయినా కాకపోయినా అన్నిటికీ ఊరికే వాళ్ళనలా ఆడిపోసుకోడం సబబు కాదు. వాళ్ళ రూళ్ళు దయాదాక్షిణ్యాలు చూపించిన సందర్భాలెన్ని లేవు.

ఓ పిక్చర్లో విలను నానా ఘోరాలు చేస్తాడు. దొంగతనం, దౌర్జన్యం, ఒక చిన్న ఖూనీ, ఒక బలాత్కారం, రెండు ఫోర్జరీలు--ఇన్ని చేస్తాడు. తీరా కథ అయిపోయి జనాభా అంతా గ్రూపు ఫోటో దిగేవేళకు పోలీసు లొచ్చేస్తారు విలన్ని తీసుకుపోవడానికి. అప్పుడు విలన్ భార్య ఏమంటుంది? "ఆయన నా భర్త. నా పసుపుకుంకాలు బాగుపడనీయండి. నన్ను చంపి గాని ఆయన్నరెస్టు చెయ్యడానికి వీల్లేదు. భారతనారి తన భర్తనలా పోలీసుల పాలుచేయదు" అంటుంది పెద్ద కుంభంబొట్టు పెట్టుకుని, పుస్తెలు (మాత్రమే) పైట ఇవతలికి కనబడేలా ఏర్పాటు చేసుకుని.

అప్పుడు హీరో ఔదార్యం చూపిస్తాడు. "ఓ విలనూ, నీ వల్లగదా నా ధైర్యసాహసాలూ,మాఆవిడ పాతివ్రత్యం ఋజువయ్యాయి. కాన నీకు మేము ఋణపడున్నాం,భయపడకు. ఓ పోలీసులూ! కేసులేదు మేం ఫిర్యాదు చెయ్యం, వాణ్ణొదిలేసి పొండి" అంటాడు.

పోలీసులు యస్సార్ అని వదిలేస్తారు. సెన్సారు వాళ్ళు వదిలేస్తారు.

వాళ్ళు కావాలంటే పేచి పెట్టరూ? కాని అవతల మహాపతివ్రత సిఫార్సాయె. గ్రేట్ సెంటిమెంట్. అది చూసి వదిలేస్తారు. మన ఫిలింవాళ్ళు కృతజ్ఞత లేకుండా వాళ్ళ ఉపకారాలు మర్చిపోయి సభలో రసభసలూ చేస్తున్నారు. దిస్ ఐ టెల్ యూ--ఈజ్ బేస్ ఇన్గ్రాటిట్యూడ్.

రైటే. రైటేనండీ. విలనుగారన్నట్టు పెళ్ళయాక ఇంక ప్రేమేమిటి. లవ్ సీన్సేమిటి--తరువాత మొగుడూ పెళ్ళాలు ఒహళ్ళ నొహళ్ళు ముట్టుకుందికి మధ్య

సెన్సారువాళ్ళ పర్మిషనేమిటి: పర్మిషను గాదు పదిలక్షలిచ్చినా పాటలుపాడుతూ ఒహాళ్ళ న్నొహాళ్ళు తాకి పులకలెత్తి నవ్వి ఆనందపడమంటే ఛస్తే పడలేరు. చల్లావణ్ణం తిన్న తరువాత పచ్చడో పప్పో కలుపుకున్నట్లు ఇపుడు రొమాన్సేప్టి సార్ ఛస్తుంటేను అంటారు. రైట్, బట్ వెయిటే మినిట్.ఒక్క నిమిషం ఆగి ఆలోచించండి. ఈ కాస్త పాయింటు ఆ రూళ్ళు పెట్టినవాళ్ళకీ సెన్సారువాళ్ళకీ తెలీదనే అనుకుంటున్నారా? అసల్నన్నడిగితే ఈ రూలుకీ ఫామిలిప్లానింగు కమిషన్‌కీ సంబంధం ఉందంటాను. ఇది చాలా లోతైన వ్యవహారం. బీదవాడి ఏకైక ఎంటర్టయిన్‌మెంటుకి ఈ సినిమాలూ, వీటిలో ప్రేమఘట్టాలూ ఈ పోస్టర్లూ దోహదాలుగా ఉంటున్నాయని, పబ్లిసిటీ సాధనాలుగా పనిచేస్తున్నాయనీ, వాటివల్లనే జనాభా ఊహూ పెరిగిపోతోందనీ వాళ్ళ అనుమానం. అందువల్లనే భర్త కంట్రోలు భార్య కంట్రోలు బాగా అమలు చేసి కుటుంబ నియంత్రణం, సంతాన నిరోధం జయప్రదం చెయ్యాలంటే సినిమాలను బాగా అదుపు చెయ్యాలి. సినిమాల్లో పెళ్ళికిముందు ప్రేమఘట్టాలు తీయించేస్తే పూర్వంలా ప్రేక్షకులు తమ పెళ్ళిళ్ళ ముందటి ప్రేమ ఘట్టాల ముచ్చట్లు గుర్తుకు తెచ్చుకొని ఊహించుకొని ఉత్సాహపడడం మానేస్తారు. దీనికితోడు పెళ్ళి తరువాత ప్రేమఘట్టాలు చూపెడితే. "ఎంత జడ్డిగా ఉన్నాయి! పెళ్ళయ్యాక కూడా వీడు రొమాన్సు డూయేట్లు అఘోరిస్తున్నాడు" అని నవ్వుకుంటారు. వాళ్ళు నవ్వుకుంటే సినిమావాళ్ళు దరిమిలాను అసలు పిక్చర్లలో లవ్ సీన్లే పెట్టరు. ప్రేమ అవుటాఫ్ ఫాషను, అవుటాఫ్ డేటూ అయిపోతుంది. నీతులు ఆవాలూ, నీతులు మెంతులూ, నీతులు జబ్బులూ, నీతులు ఏడుపులూ, అపోహలూ, నీతులు వగైరాలతో నిండిపోతాయి పిక్చర్లు. జనం హాయిగా ఇళ్ళలో కూర్చుని భారతీయ విద్యాభవన పుస్తకాలు చదువుకుంటారు--రామా కృష్ణా అనుకుంటూ....కాని అవి చాలా ప్రమాదమని, అందువలన వీళ్ళు నివారించ దలుచుకున్న సమస్య మరింత పట్టనగ్గాల్లేకుండా పోతుందనీ గ్రహించలేదు.

ఇదంతా జరుగుతుందని కాదుస్మండి, సినిమా వాళ్ళం అసాధ్యులం, రూలు ఉంటే నాలాంటి అద్భుతమైన బుర్రలు కిరాయికొచ్చి రూలునీ గీలునీ ఎగరగొట్టేస్తాయి. సవాలక్ష ఉపాయాలు చెప్తాన్నేను. పెళ్ళిముందు ప్రేమకూడదు అన్న వాక్యంలో పెళ్ళి అనగా ఏ పెళ్ళి, సనాతన భారతీయ సాంప్రదాయిక వివాహలున్నాయా మరి. గాంధర్వం,

రాక్షసం వగైరాలు.

భారత సంస్కృతి సంప్రదాయ సంరక్షకులు వాటిని కాదనగలరా?

గుళ్ళో గాంధర్వ పెళ్ళాడితే కాదండం సబబా!

అక్కడి దీపం అగ్నిసాక్షి గాదా?

కావాలంటే అగ్నిదేవుడు ప్రత్యక్షమైననట్టు చూపిస్తే పోదా?

ఒకడి భార్య, ఒకర్తె భర్త--ఇద్దరూ వివాహితులే కాబట్టి ప్రేమించి డ్యూయెట్లు పాడడలం అధర్మమా?

పెళ్ళయిన పిల్లవానికి కలొచ్చి అందులో మొగుడూ తనూ పెళ్ళి గాకముందు సరసాలాడినట్టు కనపడడం సెన్సార్ పక్షం అనిపించుకోదా!

విష్కంభంలో రిజిష్టరు పెళ్ళి చేసుకొచ్చి డూయెటు గట్రా పాడి సరసాలాడి తరవాత సెన్సారువాళ్ళు అయ్ అంటే మాకు రిజిష్టరు పెళ్ళయియుండచ్చు. కావాలంటే ఇపుడు సివిలు పెళ్ళాడతామొచ్చి అంటే అది సెన్సారు పక్షం అనిపించుకోదా!

తెలుగు సినిమాలో లవ్‌సీన్స్ గొడ్డు (పాపము శమించుగాక) పోతాయా?

మిగతా కథ వెండితెర మీద చూడండి.

